రెచ్చగొట్టే వ్యాఖ్యలకు అడ్మిన్లదే బాధ్యత

- సోషల్ మీడియాపై నజర్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో సోషల్ మీడియాపై రాష్ట్ర పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సోషల్ మీడియా ఖాతాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో పెట్టే పోస్టులు, చేసే కామెంట్లపై నెటిజన్లు, ఆయా గ్రూపుల సభ్యులు జాగ్రత్తలు వహించాలి. ఆయా గ్రూపుల్లో పార్టీలను, అభ్యర్థులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, పోస్టు పెట్టడం, ఫొటో ఎడిట్ చేయడం, వాయిస్ మెసేజ్‌లు పెట్టడం తక్షణమే మానుకోవాలని సూచించారు. ఆయా గ్రూపుల్లో తమకు వ్యతిరేకంగా వచ్చిన పోస్టుల ఆధారంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. తప్పనిసరిగా అడ్మిన్, ఆ పోస్టు చేసిన వ్యక్తిని విచారించి, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

తెలంగాణ పథకాలు కేంద్రం కాపీ

- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- బీఆర్ఎస్‌లో మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్, ఆంజనేయులు

మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

హైదరాబాద్/మెదక్ (నమస్తే తెలంగాణ)/పాపన్నపేట, అక్టోబర్ 13: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక వినూత్న పథకాలను కేంద్రం, ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని యూసూఫ్‌పేటలో జరిగిన కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, మెదక్ పట్టణంలో పీసీసీ అధికార ప్రతినిధి, 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు అనుచరులతో కలిసి కాంగ్రెస్‌ను వీడి మంత్రి హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కంటివెలుగు కార్యక్రమాన్ని కేరళ, పంజాబ్, ఢిల్లీ సీఎంలు సైతం ప్రశంసించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో వేరే పార్టీని గెలిపిస్తే కరెంటు కష్టాలు తప్పవని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి కరెంటు కష్టాలు మొదలయ్యాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజల విశ్వాసం కోల్పోయింది: శశిధర్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్కేభవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్, అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పెద్దలకు వివరించినా, వారు పట్టించుకోలేదని తెలిపారు. పొన్నాల లక్ష్మయ్య ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి వినతిపత్రం ఇస్తే కేసీ వేణుగోపాల్ పట్టించుకోలేదని, రాహుల్‌గాంధీని కలిసి చెప్పాలని స్పష్టం చేశారని వివరించారు. రాహుల్‌గాంధీ కొందరి చేతిలో బందీ అయ్యారని వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్యతో పాటు చాలా మంది కాంగ్రెస్‌లో అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఆ పార్టీ గడ్డు పరిస్థితుల్లో ఉన్నదని పేర్కొన్నారు.

ఈటల.. దమ్ముంటే గజ్వేల్‌లోనే పోటీచేయాలి

- హుజూరాబాద్‌లోనూ గెలిచే పరిస్థితి రాజేందర్‌కు లేదు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి గంగుల

కొత్తపల్లి, అక్టోబర్ 13 : ఈటల రాజేందర్‌కు దమ్ముంటే గతంలో ఆయన చెప్పినట్టుగా సీఎం కేసీఆర్‌పై గజ్వేల్‌లోనే పోటీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సవాల్ విసిరారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ యువజన సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి మీడియాతో మాట్లాడారు. హుజూరాబాద్, గజ్వేల్ నుంచి రెండు చోట్ల నుంచి పోటీ చేస్తానని బీజేపీ నేత ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఈటల రాజేందర్‌కు హుజూరాబాద్‌లో కూడా ఓటమి భయం పట్టుకున్నదని, అందుకే రెండు చోట్లా పోటీ చేస్తానని అంటున్నాడని దుయ్యబట్టారు. దమ్ముంటే ఒక్క గజ్వేల్‌లోనే కేసీఆర్‌పై పోటీ చేయాలని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్నవారికి, భూ కబ్జాలు, మతతత్వ పార్టీలకు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం కల్పించవద్దని సూచించారు. కాంగ్రెస్ బీ-ఫారాలు బీజేపీ ఆఫీసులో, బీజేపీ బీ-ఫారాలు కాంగ్రెస్ ఆఫీసులో తయారవుతున్నాయని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ పథకాలు అమలు చేయడానికి అక్కడి కాంగ్రెస్ సర్కార్ ఇబ్బందులు పడుతున్నదని చెప్పారు. ఇక్కడ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారని? ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణలో ఒక్క సీటు కూడా గెలుచుకొనే అవకాశం లేదని, ఇక ఈటల రాజేందర్ సీఎం ఎలా అవుతాడో ఆయనే చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీయే తమ భవిష్యత్తు అని ప్రజలు నమ్ముతున్నారని, సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములన్నీ ఇప్పుడు పచ్చని పంటలతో నిండుగా కనిపిస్తున్నాయని, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. ఆంధ్రాకు చెందిన కొందరు కాంగ్రెస్, బీజేపీ ముసుగులో వచ్చి పచ్చని తెలంగాణను చూసి ఓర్వలేక, కడుపు మంటతో ఇక్కడి సంపదను దోచుకొనే ప్రయత్నంలో భాగంగా ఆంధ్రాలో కలపాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ కేసీఆర్ చేతిలో ఉంటే వాళ్ల పప్పులు ఉడకవని అన్నారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

'గులాబీల జెండలే రామక్క' విడుదల

- సీడీలను ఆవిష్కరించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): మలి దశ ఉద్యమంలో చావు నోట్లో తల పెట్టి కేసీఆర్ చేసిన పోరాటాన్ని, రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఆయన సారథ్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాగర్‌కర్నూల్‌కు చెందిన కొందరు జానపదులు 'గులాబీల జెండలే రామక్క' అనే పాట రూపంలోకి తీసుకొచ్చారు. ఈ పాటను శుక్రవారం ప్రగతిభవన్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు విడుదల చేశారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబించేలా ఈ పాట ఉన్నదని, పాట పాడిన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని తాండ్ర గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మమ్మ, బొల్లె సుశీల, శాంతమ్మ, కళమ్మ, అనసూయలను మంత్రులు అభినందించారు. ఈ పాటను మంత్రులు విడుదల చేయడం సంతోషంగా ఉన్నదని గాయకులు తెలిపారు. గానంతో ఆకట్టుకున్న కొమ్ము లక్ష్మమ్మ బృందానికి మంత్రి కేటీఆర్ పోచంపల్లి చీరలను బహూకరించి, సత్కరించారు. పాటకు సంగీతాన్ని అందించిన మ్యూజిక్ డైరెక్టర్ కల్యాణ్ కీస్‌ను మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు. పాట విడుదలైన కొద్దిసేపట్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈటలను రెండు చోట్లా ఓడిస్తాం

- దళిత బాధితుల సంఘం అధ్యక్షుడు సంపత్
- ఈటల అరాచకాలపై కరపత్రాలు

హుజూరాబాద్‌లో ఈటల మోసాలపై రూపొందించిన కరపత్రాలను విడుదల చేస్తున్న ఈటల దళిత బాధితుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిప్పారపు సంపత్ తదితరులు

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 13 : బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఒక మోసగాడని, ఆయన అరాచకాలపై 50 వేల కరపత్రాలను హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో పంచి, ఆయన్ను ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఈటల దళిత బాధితుల సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిప్పారపు సంపత్ స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం నాయకులతో కలిసి సంపత్.. ఈటల మోసాలపై రూపొందించిన కరపత్రాలను విడుదలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ హుజురాబాద్ నియోజకవర్గంలో తమలాంటి కుటుంబాలను ఎంతో మందిని చంపించడం, కొట్టించడం, కేసులు బనాయించడం వంటివి చేశారని ఆరోపించారు. ఊరూరా ఈటల బాధితులు ఉన్నారని, ఈ ఎన్నికల్లో ఆయన గ్రామాలకు వెళ్తే చెప్పులతో కొడతారని స్పష్టం చేశారు. ఈటల అక్రమ ఆస్తులపై సీబీఐ విచారణ జరపాలని అడిగిన తనపై సరిగా ఐదేండ్ల కిందట ఇదే రోజు (2018 అక్టోబర్ 13)న అనేక కేసులు పెట్టి జైలుకు పంపించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతి సారి అసెంబ్లీ ఎన్నికల్లో మోసపు మాటలు చెప్తూ గెలుస్తున్నారని, గత ఉప ఎన్నికల్లోనూ అనేక దొంగ మాటలు చెప్పి గెలిచాడని ఆరోపించారు. హుజూరాబాద్ ప్రజల ఆత్మ గౌరవం కోసం పోరాడుతానని చెప్పిన ఈటల ఢిల్లీలో ఆయన రాజకీయ మనుగడ కోసం పోరాడుతున్నాడని విమర్శించారు. హుజూరాబాద్ ప్రజలను మోసం చేసి గెలవడం అలవాటుగా మారిందని, మళ్లీ ఏ మొఖం పెట్టుకొని వచ్చి ఓట్లు అడుగుతాడని ప్రశ్నించారు. ఈటలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో ఈటల దళిత బాధితుల సంఘం హైకోర్టు లీగల్ అడ్వైజర్ ఇంద్రానిదేవి, ఉపాధ్యక్షుడు మేకల సుధాకర్, ప్రధాన కార్యదర్శి నమిండ్ల రాజేశ్వర్, అధికార ప్రతినిధి కదిరె రమేశ్, కార్యదర్శి దాట్ల ప్రవీణ్, సహాయ కార్యదర్శి చల్లూరి రాహుల్ పాల్గొన్నారు.

కారు కోసం ముక్తకంఠం

పల్లాకు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న ధూళిమిట్ట ముదిరాజ్ కుల సంఘం పెద్దలు

పల్లాకు ధూళిమిట్ట ముదిరాజ్‌ల మద్దతు

మద్దూరు (ధూళిమిట్ట), అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం కుల పెద్దలు ప్రకటించారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆ పత్రాన్ని శుక్రవారం రాత్రి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అందజేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. తనకు మద్దతుగా తీర్మానం చేసిన ధూళిమిట్ట ముదిరాజ్ కుల సంఘానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

మేమంతా మంత్రి కేటీఆర్ వెంటే..

సిరిసిల్ల టౌన్/ఇల్లంతకుంట, అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తామంతా బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటామంటూ పలు సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పాలిస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లతో నేతన్నలకు బతుకునిచ్చిన కేటీఆర్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీనిస్తామని పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి దేవదాస్ స్పష్టం చేశారు.

రసమయి వెంటే గొల్లపల్లి గ్రామస్థులు

ఇల్లంతకుంట, అక్టోబర్ 13: మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామస్థులు మద్దతు తెలిపారు. తమ ఓటు రసమయికే.. మూడోసారి భారీ మెజార్టీ అందిస్తామని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు కృతజ్ఞతలు తెలిపారు.

గంగుల కోసం యువకుల ప్రతిజ్ఞ

కొత్తపల్లి, అక్టోబర్ 13 : కరీంనగర్ నియోజకవర్గం నుంచి మంత్రి గంగుల కమలాకర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కొత్తపల్లి మండలానికి చెందిన యువకులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఎస్వీఆర్ గార్డెన్స్‌లో మంత్రి గంగుల కమలాకర్‌కు యువజన నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

హైదరాబాద్ సీపీగా సందీప్ శాండిల్య

- 21 మంది ఐపీఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు
- సీఎస్ ఆదేశాలతో బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్, ఐపీఎస్ అధికారులు శుక్రవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సందీప్ శాండిల్యతోపాటు నాలుగు జిల్లాలకు కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులుగా, సీపీలు, ఎస్పీలుగా వారంతా విధుల్లో చేరిపోయారు. అసెంబ్లీ ఎన్నికల తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం 20 మంది ఉన్నతస్థాయి అధికారులను బుధవారం బదిలీ చేసింది. వారి స్థానాల్లో నూతన అధికారులను నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈసీ సూచనల మేరకు అధికారులకు పోస్టింగ్ ఇస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా ప్రస్తుతం పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సందీప్ శాండిల్యను నియమించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏడీజీగా ఆయనకు అదనపు బాధ్యతలూ అప్పగించారు. కొత్తగా నియమితులైన అధికారులు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలలోగా బాధ్యతలు చేపట్టాలన్న సీఎస్ ఆదేశాలతో ఆ గడువులోగా అందరూ బాధ్యతలు స్వీకరించారు.

ఐపీఎస్ అధికారుల బదిలీలు

పేరు	పోస్టింగ్
సునీల్ శర్మ	ఎక్సైజ్, వాణిజ్య పన్ను, ఎండోమెంట్ ముఖ్య కార్యదర్శి
జ్యోతి బుద్ధప్రకాశ్	ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి
వాణీప్రసాద్	రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ
క్రిస్టినా చొంగ్తు	వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్
భారతి హోలీకేరీ	రంగారెడ్డి కలెక్టర్
గౌతమ్ పొట్రు	మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్
హనుమంత్ కొండిబా	యాదాద్రి-భువనగిరి కలెక్టర్
ఆశిష్ సంగ్వాన్	నిర్మల్ కలెక్టర్

పోలీస్ కమిషనర్లు, ఎస్పీల జాబితా

అధికారి పేరు	పోస్టింగ్
సందీప్ శాండిల్య	హైదరాబాద్ పోలీస్ కమిషనర్, యాంటీ నార్కొటిక్ బ్యూరో(అదనపు బాధ్యతలు)
అంబర్ కిశోర్ ఝా	వరంగల్ పోలీస్ కమిషనర్
కల్మేశ్వర్ సింగెనవర్	నిజామాబాద్ పోలీస్ కమిషనర్
చెన్నూరి రూపేశ్	సంగారెడ్డి ఎస్పీ
సింధూ శర్మ	కామారెడ్డి ఎస్పీ
సన్‌ప్రీత్ సింగ్	జగిత్యాల ఎస్పీ
హర్షవర్ధన్	మహబూబ్‌నగర్ ఎస్పీ
వైభవ్ రఘునాథ్	నాగర్‌కర్నూల్ ఎస్పీ
రితిరాజ్	జోగులాంబ గద్వాల ఎస్పీ
పాటిల్ సంగ్రామ్‌సింగ్	మహబూబాబాద్ ఎస్పీ
యోగేశ్ గౌతమ్	నారాయణపేట ఎస్పీ
కిరణ్ ప్రభాకర్	భూపాలపల్లి ఎస్పీ
రాహుల్ హెగ్డే	సూర్యాపేట ఎస్పీ

సిగ్గు ఉండొద్దంటాడా?

- రేవంత్‌ది కులదురంహకారం
- పొన్నాలపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ బీసీ నేతల మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యపై ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీలోని బీసీ నేతలు భగ్గుమంటారు. '40 ఏండ్లు అనుభవించి.. సిగ్గుండాలె. ఈ వయస్సులో పార్టీ మారడానికి.. సచ్చే ముందల ఏం రోగం వచ్చిందయ్యా ఆయనకు. ఏం తక్కువ చేసింది పార్టీ ఆయనకు. అన్ని ఇచ్చింది.. సిగ్గు ఉండొద్దు' అని పొన్నాలపై ఢిల్లీలో రేవంత్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. పార్టీని వీడిపోతున్న సీనియర్ నేతపై రేవంత్ వ్యాఖ్యలు ఆయన అగ్రవర్ణ కుల దురహంకారానికి నిదర్శమని బీసీ నేతలు మండిపడుతున్నారు.. పొన్నాల రాజకీయ జీవితం అంత వయస్సులేని రేవంత్ 'సిగ్గు ఉండొద్దు' అంటారా? అని భగ్గుమంటున్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను అణచివేస్తుందని, రేవంత్ పీసీసీ అధ్యక్షుడు అయినప్పటి నుంచి తన వర్గాన్ని మినహా తక్కిన వర్గాల వారిని.. పొమ్మనలేకపొగపెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. బీసీలకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదన్న విమర్శలను సరిదిద్దుకోవాల్సిందిపోయి వారిపై రేవంత్ నోరుపారేసుకోవటాన్ని ఆ వర్గం నేతలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ సీనియర్లను, అదీ పీసీసీ ప్రెసిడెంట్‌గా పనిచేసి సుదీర్ఘ రాజకీయ జీవితం ఉన్న పొన్నాల లక్ష్మయ్యపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతున్నది. ఢిల్లీలో మీడియా ముందే రేవంత్ అలా రెచ్చిపోయి మాట్లాడితే ఇక నాలుగు గోడల మధ్య బీసీవర్గాల నేతలపై, పార్టీ సీనియర్ నాయకులపై ఆయన ఆధిపత్యం ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని పేరుచెప్పటానికి నిరాకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. రేవంత్ కేవలం పొన్నాలను మాత్రమే అవమానించలేదని, కాంగ్రెస్ పార్టీలోని సమస్త బీసీ నాయకులను, బీసీ క్యాడర్ ఆత్మగౌరవాన్ని కించపరిచారని మండిపడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహి

- అందులో ఇప్పుడు వ్యక్తిస్వామ్యమే
- బీసీ నేతలకు నిత్యం అవమానాలే
- వారి పడగనీడలో మనుగడ లేదు
- నాలుగుసార్లు గెలిచి, మంత్రి పదవి చేపట్టిననాకే గౌరవం లేదు
- అభిప్రాయం పట్టించుకోలే
- అందుకే పార్టీ వీడాలని అనుకున్న
- భవిష్యత్తు గురించి ఆలోచించలేదు
- నడమంత్రపు నాయకత్వం పార్టీని నట్టేట ముంచుతున్నది
- టీపీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య భావోద్వేగం

రాజీనామా లేఖను చూపిస్తున్న మాజీ మంత్రి, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహి అని మాజీ మంత్రి, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మండిపడ్డారు. 45 ఏండ్లుగా నిస్వార్థంగా, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి పని చేస్తున్నా.. సీనియర్లపట్ల మరీ ముఖ్యంగా బీసీ నేతలను అవమానాలకు గురిచేస్తున్న పార్టీ తీరు తనను తీవ్రంగా కలిచివేసిందని కంటి తడి పెట్టారు. కాంగ్రెస్ పార్టీలో అవమానాలు, అవహేళనలు భరించలేకే పార్టీ వీడుతున్నట్టు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొన్నాల లక్ష్మయ్య మాట్లాడారు. రాజీనామాకు గల కారణాలను వెల్లడించారు. 45 ఏండ్ల రాజకీయ జీవితంలో కాంగ్రెస్ పార్టీలో ఉండడాన్ని గర్వంగా చెప్పుకున్నానని, కానీ గత రెండేండ్లుగా పార్టీలో జరుగుతున్న పరిణామాలు తీవ్రంగా కలిచివేస్తున్నాయని ఆవేదన చెందారు. అనేక అవమానాలు, అవహేళనలను ఎదుర్కొన్నానని భావోద్వేగానికి గురయ్యారు. తనతో అత్యంత అవమానకరంగా ప్రవర్తించారని కన్నీటి పర్యంతమయ్యారు. పేద కుటుంబం నుంచి వచ్చి, నాసాలో పనిచేసి, మహోన్నతమైన పదవులు నిర్వర్తించానని, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా, పేదలకు సేవ చేసేందుకు రాజకీయాల్లో వచ్చినానని వివరించారు. తాను నాలుగుసార్లు వరుసగా గెలిచిన బీసీ నేతనని, మంత్రిగా వివిధ శాఖలకు కొత్తరూపును తీసుకొచ్చానని వివరించారు. అయినప్పటికీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో గుర్తింపు లేకుండాపోయిందని, పార్టీలో అంతా వ్యక్తిస్వామ్యం కొనసాగుతున్నదని ధ్వజమెత్తారు. పార్టీలో తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తంచేశారు.

మరో బీసీ నేతకు రేవంత్ చెక్

- ఎల్బీ నగర్‌లో మధుయాష్కీకి పోగ
- ఆయనకు పోటీగా తెరపైకి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్
- ఇప్పటికే పార్టీని వీడిన నందికంటి శ్రీధర్, పొన్నాల లక్ష్మయ్య
- పీసీసీ బాస్ వ్యూహాలతో తల్లడిల్లుతున్న బీసీ నేతలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో బీసీ సామాజికవర్గానికి చెందిన మరో సీనియర్ నేతకు చెక్ పెట్టేలా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పావులు కదుపుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే బీసీ వర్గానికి చెందిన మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరగా తాజాగా పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య కూడా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. జనగామలో తన అనుచరుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి టికెట్ ఇప్పించుకునేందుకు పొన్నాలకు పొగ బెట్టారని కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మరో కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ ప్రచార కమటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీని సైతం రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారనే ప్రచారం నడుస్తున్నది. బీసీ సామాజికవర్గానికి చెందిన మధుయాష్కీకి చెక్ పెట్టేందుకు అదే సామాజికవర్గానికి చెందిన మరోనేత ముద్దగోని రామ్మోహన్‌గౌడ్‌ను ప్రయోగిస్తున్నారనే టాక్ వినిపిస్తున్నది. ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్న 24 గంటల లోపే ఆయనను ఢిల్లీకి తీసుకెళ్లి ఎల్బీనగర్ టికెట్ ఇప్పించే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. పార్టీలోని పలువురు సీనియర్ బీసీ నేతలను దెబ్బతీసేలా రేవంత్‌రెడ్డి పన్నుతున్న వ్యూహాలపై ఆ వర్గం నేతల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. మధుయాష్కీ ఈసారి ఎల్బీనగర్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ వెంటనే స్థానికేతరుడైన మధుయాష్కీకి టికెట్ ఇవ్వొద్దంటూ గాంధీభవన్‌లో పోస్టర్లు వెలిశాయి. తన స్వస్థలం హయత్‌నగర్ అని, తాను స్థానికుడినేనని యాష్కీ వాదించుకోవడంతో ఆ వాదన వీగిపోయింది. దీంతో యాష్కీకి లైన్‌క్లియర్ అయిందని బీసీ నేతలు భావించారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ తెర మీదకు వచ్చారు. గురువారం ఆయనను తన ఇంటికి పిలిపించుకొని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పారు. ఆ వెంటనే ఆయనను ఢిల్లీకి తీసుకెళ్లినట్టు తెలుస్తున్నది. రామ్మోహన్, యాష్కీ అభ్యర్థిత్వంపై సర్వే నిర్వహించి, ఎవరికి అనుకూలంగా రిపోర్టు వస్తే వారికే టికెట్ అనే ప్రచారం శుక్రవారం రాత్రి నుంచి కాంగ్రెస్‌లో జరుగుతున్నది. గతంలోనూ అనేక నియోజకవర్గాల్లో రేవంత్‌రెడ్డి ఇదే అస్త్రంతో ఇతర నేతలకు చెక్ పెట్టి తన అనుయాయులకు టికెట్ ఇప్పించుకుంటున్నారనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే టికెట్ల కోసం కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

బీసీ నేతలను మనోవేదనకు గురిచేస్తున్న